వరుస తుఫాన్లతో బెంబేలు

- ఖరీఫ్ నాట్లు వేసిన నాటి నుంచి ఐదు దఫాలుగా వర్షాలు
- కోతకు గురైన వరాహా నది గట్లు
- మళ్లీ అల్ప పీడన హెచ్చరికలతో అన్నదాతల ఆందోళన



ఆశాజనకంగా వరి



కోతకు గురైన వరాహా నది గట్లు

ఎస్.రాయవరం: వరుస తుఫాన్లు అన్నదాతను బెంబేలెత్తిస్తున్నాయి. ఖరీఫ్ వరి నాట్లు వేసినప్పటి నుంచి ఇప్పటి వరకు ఐదు సార్లు పడిన భారీ వర్షాలు కంటి మీద కునుకు లేకుండా చేశాయి. తాజాగా మరో అల్ప పీడన హెచ్చరికలతో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు. పంట చేతికి వచ్చే సమయానికి ఇలా ప్రకృతి పడగ విప్పడంపై కలవర పాటుకు గురవుతున్నారు. ఎస్.రాయవరం మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ నాట్లు వేసిన రైతులను ఐదు దఫాలుగా తుఫాన్లు, రోజుల తరబడి కురిసిన వర్షాలు దెబ్బతీశాయి. ఒకటి, రెండు దఫాలు నాట్లు పూర్తయిన తరువాత పంట నీట మునిగిన పరిస్థితులు కూడా ఎదురయ్యాయి. ప్రస్తుతం పొట్ట దశకు చేరుకున్న పంటకు ఆరుతడి నీరు అందితే సరిపోతుంది. తరచూ భారీ వర్షాల కారణంగా ప్రస్తుతం వరాహ నది ఉప్పొంగి నిండుగా ప్రవహిస్తోంది. కాలువలు, చెరువుల నుంచి పంట పొలాలకు సాగునీరు వెళ్లే గట్లకు ఉన్న గేట్లు పటిష్టంగా లేకపోవడంతో నీరు నేరుగా పొలాలను ముంచెత్తుతోంది. దీంతో అధిక వర్షాలు పడితే వెంటనే పంట నీట మునిగి నష్టాన్ని తెచ్చే పరిస్థితులు నెలకొన్నాయి. సీజన్‌కు ముందు గట్లు, గేట్లను సరిచేస్తే ఈ పరిస్థితి ఉండేది కాదని రైతులు చెబుతున్నారు. తీరా పంట నష్టం జరిగాక పరిహారాన్ని కూడా ప్రభుత్వం నుంచి పూర్తిగా అందే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ వర్షాలు అనుకూలంగా ఉండడంతో సాధారణ స్థాయిని మించి, సుమారు 10 వేల ఎకరాల్లో వరి నాట్లు వేశారు. ప్రస్తుతం పంట ఆశాజనకంగా ఉంది. గత నెల్లో వర్షాలకు నీటమునిగిన పంటలు కూడా తేరుకుని పొట్ట దశకు చేరుకున్నాయి. ఈ క్రాప్ నమోదు ప్రక్రియ ఏస్థాయిలో చేశారో రైతులకు, కౌలు రైతులకు పూర్తి సమాచారం లేదు. పంట నష్టం జరిగితే ప్రభుత్వం ఏప్రాతిపదికన చెల్లింపులు చేస్తుందో రైతులకు అవగాహన లేకుండా పోయింది. వరుణుడు శాంతించి పంట చేతికి వచ్చే వరకు భారీ వర్షాలు పడకపోతే ఈ ఏడాది రైతులు గట్టెక్కే పరిస్థితులు నెలకొన్నాయి.

భారీ వర్షాలు పడితే నష్టమే



మా పంట పొలాలకు వరద నీరు వస్తే సకాలంలో దిగువకు పోయే మార్గం ఆక్రమణలకు గురైంది. వరాహ నది కాలువకు అనుకుని పరిశ్రమలు నిర్మాణం చేయడం వల్ల కాలువలు ఇరుకుగా మారిపోయాయి. నది ప్రవాహం ఏమాత్రం పెరిగినా పంట పొలాలు నీట మునగడం ఖాయం. భారీ వర్షాలు పడితే ముప్పు తప్పదు.

– పొలుమూరి అప్పలరాజు, రైతు, కొత్త పోలవరం

పెరిగిన సాగు విస్తీర్ణం



మండలంలో సాధారణ విస్తీర్ణంకు మించి ఈ ఏడాది వరి నాట్లు పడ్డాయి. సాధారణ సాగు విస్తీర్ణం 3280 హెక్టార్లు కాగా, 3404 హెక్టారల్లో వరి నాట్లు వేశారు. 4 వేల మంది రైతులు ఉండగా.. 1200 మంది కౌలు రైతులు వేసిన నాట్లు ఉన్నాయి. వీరందరికీ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ క్రాప్ నమోదు చేశాం. ఇంత వరకు కురిసిన వర్షాలకు వరికి ఎటువంటి నష్టం లేదు. ఇకపై ఇదే విధంగా వర్షాలు ఉంటే నష్టం తీవ్రత ఉంటుంది.

– సౌజన్య, వ్యవసాయాధికారి, ఎస్.రాయవరం మండలం

క్లుప్తంగా

'అభిజిత్' లే-ఆఫ్ ఎత్తివేయాలి



అచ్యుతాపురంలో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నేతలు

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండలం ఎస్ఈజెడ్‌లోని అభిజిత్ కంపెనీ అక్రమ లే-ఆఫ్ ప్రకటించడం సరికాదని సీఐటీయూ మండల కార్యదర్శి కూండ్రపు సోమునాయుడు అన్నారు. అభిజిత్ కంపెనీ లే-ఆఫ్ ఎత్తి వేయాలని కోరుతూ ఆదివారం అచ్యుతాపురంలో కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజులుగా తమకు న్యాయం చేయాలని కోరుతూ అభిజిత్ కంపెనీ ఉద్యోగులు, కార్మికులు ఆందోళన చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. కార్మిక చట్టాలను ఉల్లంఘించిన కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలన్నారు. లేకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ఆవు పాల సేకరణ ధరను పునరుద్ధరించాలి



గణపర్తి పాలకేంద్రం ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

మునగపాక: తగ్గించిన ఆవు పాల సేకరణ ధరను పునరుద్ధరించాలని సీపీఎం నాయకుడు కర్రి అప్పారావు కోరారు. మండలంలోని గణపర్తి పాల కేంద్రం ఎదుట రైతులతో కలిసి ఆదివారం ఆయన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ విశాఖ డెయిరీ రైతులను ఆదుకోవాల్సింది పోయి ఆవు పాలకు సంబంధించి లీటరు ఒక్కంటికి రూ.4 చొప్పున తగ్గించడం సరికాదన్నారు. రైతులకు న్యాయం జరిగేలా పాల ధరను పెంచడంతో పాటు బోనస్ అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేత బ్రహ్మాజీ, పలువురు రైతులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న పోలిమహేశ్వరరావు కుటుంబ సభ్యులు

మునగపాక: మునగపాకలో తలపెట్టిన వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి భక్తులు తమ వంతు విరాళాలు అందజేస్తున్నారు. మునగపాక బైపాస్ రోడ్డులో రూ.4 కోట్ల వ్యయంతో స్వామి ఆలయ నిర్మాణం చేపట్టిన సంగతి తెలిసిందే. మునగపాకకు చెందిన ఆడారి పోలి మహేశ్వరరావు ఆలయ నిర్మాణానికి తనవంతుగా రూ.25 వేల నగదు ఆదివారం అందజేశారు. కమిటీ సభ్యులు సూరిశెట్టి రాము, దాడి ముసిలినాయుడు, ఆడారి కాశీబాబు, మళ్ల రామజగన్నాథం, ఆడారి లక్ష్మణరావు, బొడ్డేడ రామునాయుడు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా సంకటహర చతుర్థి



ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

నక్కపల్లి: మండల కేంద్రం నక్కపల్లి చేనేత కాలనీలో ఉన్న వరసిద్ధి వినాయక ఆలయంలో ఆదివారం సంకటహర చతుర్థిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉపమాక దేవస్థానం ప్రధానార్చకుడు గొట్టుముక్కల వరప్రసాద్, ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో వినాయకుడికి విశేష పూజలు చేశారు. కాలనీ వాసులతో పాటు బండారుపేట ప్రజలు ఈ పూజల్లో పాల్గొన్నారు. పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో గ్యార్వీ షరీఫ్ వేడుకలు



చందన ఊరేగింపులో ముస్లింలు

నక్కపల్లి: మండలంలోని పెదబొదిగల్లం, అప్పల పాయకరావుపేట, రామకృష్టాపురం, చినబోదిగల్లం, పెద దొడ్డిగల్లు గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో గ్యార్వీ షరీఫ్ వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని మసీదులు, దర్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఖురాన్ పఠనం జరిగింది. కార్యక్రమాల్లో భాగంగా పలువురు మౌల్వీలు గ్యార్వీ షరీఫ్ ప్రాశస్త్యతను వివరించారు. గౌస్‌లాజమ్ జీవన విధానాన్ని తెలియజేశారు. ఆయన బోధనలను ఆచరించాలన్నారు. గ్యార్వీ షరీఫ్ వేడుకలను పురస్కరించుకొని గౌస్‌లాజమ్ జెండాను, చందనాన్ని ఊరేగించి, దర్గాల వద్ద ప్రతిష్టించారు. బంధువుల రాకతో ఆయా గ్రామాల్లో సందడి నెలకొంది. వేడుకలను పురస్కరించుకొని ఆయా గ్రామాల్లో మసీదులు, దర్గాల వద్ద విందు భోజనం నిర్వహించారు. అధిక సంఖ్యలో ముస్లింలతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయిబాబా అవతార దినోత్సవం

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేటలో ఆదివారం భగవాన్ సత్యసాయిబాబా అవతార దినోత్సవం ఘనంగా జరిగింది. సత్యసాయిబాబా భక్తులు, బాల వికాస్ పిల్లలు సంకీర్తనలు ఆలపిస్తూ భజనలు చేస్తూ ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. సాయి నామ స్మరణతో తిమ్మరాజుపేట మార్మోగింది. తిమ్మరాజుపేట సత్యసాయి ట్రస్ట్ కన్వీనర్ సరిసా శివ, భజన మండలి కన్వీనర్ పెద రమణ, మళ్ల అప్పలనాయుడు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రేమ సమాజానికి దుస్తుల వితరణ



ప్రేమ సమాజంలో పిల్లలకు దుస్తులు అందిస్తున్న సుబ్రహ్మణ్యం దంపతులు

యలమంచిలి రూరల్: కొక్కిరాపల్లి ప్రేమ సమాజంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులు, పిల్లలకు రూ.5 వేలు విలువ చేసే దుస్తులను తన కుమారుడి జన్మదినం సందర్భంగా రాంబిల్లి వీఆర్వో సుబ్రహ్మణ్యం దంపతులు ఆదివారం అందజేశారు. దాతకు ప్రేమ సమాజం కార్యదర్శి రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

నవంబర్ 11న శూలాల మహోత్సవం

మునగపాక: ఉత్తరాంధ్రలో పేరుగాంచిన మునగపాక శూలాల మహోత్సవం నవంబర్ 11న నిర్వహించనున్నట్టు సాంబశివ ఉత్సవ కమిటీ చైర్మన్ బూడిద శ్రీనివాసరావు తెలిపారు. మునగపాక సాంబశివుని ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఉత్సవ నిర్వహణపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏటా కార్తీక మాసం రెండో సోమవారం శూలాల మహోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ ఏడాది కూడా రాజకీయాలకు అతీతంగా ఉత్సవ విజయవంతంలో భాగస్వామ్యం కావాలన్నారు. ఈ సమావేశంలో పెద్దలు కోనపల్లి రామ్మోహనరావు, బుద్ద వెంకటి, దిమ్మల నూకరాజు, ఆడారి కాశీబాబు, టిక్కలి రమణబాబు, మాడెం జోగారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



మృతి చెందిన స్నేహితుల పిల్లలకు ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం జిల్లా పరిషత్ హైస్కూల్ ఆదివారం పూర్వ విద్యార్థులతో కళకళలాడింది. ఈ స్కూల్‌లో 2003–04లో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమావేశం జరిగింది. నాటి తీపి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. వివిధ రంగాల్లో స్థిరపడిన వారంతా ఉత్సాహంగా గడిపారు. ఎవరికి ఎటువంటి ఆపద వచ్చినా అందరూ అండగా నిలవాలని నిర్ణయించుకున్నారు. దీనిలో భాగంగా చోడపల్లికి చెందిన చొప్పా బాలకృష్ణ, అల్లు సంధ్యారాణి అకాల మృతితో ఇబ్బంది పడుతున్న వారి కుటుంబ సభ్యులను ఆదుకునేందుకు పూర్వ విద్యార్థులు ముందుకొచ్చారు. వారి పిల్లల పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసి, పత్రాలు అందజేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కోటవురట్ల: పందూరులో ఆంజనేయస్వామి ఆలయ 4వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామికి సిందూర, తమలపాకు అభిషేకాలు చేశారు. ఆలయం వద్ద భక్తులకు ఇబ్బంది కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. ప్రసాద వితరణ చేశారు.

మామిడిలో అంతర పంటగా నువ్వు సాగు



సూదివలసలో అంతర పంటగా సాగులో ఉన్న నువ్వు పంట

కె.కోటపాడు : అంతర పంటల సాగు విధానంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. మండలంలో మామిడి పంటలను సాగుచేస్తున్న మెట్ట ప్రాంత గ్రామాల్లో గల రైతులు ప్రస్తుతం ఇప్పటికీ మామిడి పంటలో అంతర పంటగా నువ్వు పంటను సాగు చేస్తున్నారు. మొక్కదశలో ఉన్న మామిడి తోటల గల మధ్య గల ఖాళీ ప్రాంతంలో నువ్వు పంటను సాగు చేస్తున్నారు. మామిడిలో అంతర పంటగా నువ్వు సాగును చిరికివానిపాలెం, యడ్లవానిపాలెం, కొరువాడ, కె.కె.అగ్రహారం, సూదివలస గ్రామాల్లో సాగు చేస్తున్నారు. మామిడి పూతదశకు చేరుకున్న సమయంలో నువ్వు పంట కోత దశకు చేరుకుంటుందని సాగు రైతులు పేర్కొంటున్నారు. అంతర పంటల వల్ల సాగు లాభదాయకంగా ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మోదకొండమ్మ ఆలయానికి భక్తుల తాకిడి



మాడుగుల : ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఆలయానికి ఆదివారం భక్తుల తాకిడి పెరిగింది. ఆలయ ప్రాంగణంలో పండగ వాతావరణం నెలకొంది. గ్రామానికి చెందిన 140 మంది భక్తులు అమ్మవారి ప్రతి రూపమైన ఘటాలు శిరస్సున పట్టుకుని ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని పూలు నగలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు ఉచితంగా ప్రసాదం, తాగునీరు ఆలయ కమిటీ అందజేసింది.

ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభ



ప్రొఫెసర్ సాయిబాబా చిత్రపటం వద్ద అంజలి ఘటిస్తున్న రాజకీయ ప్రతినిధులు, అధికారులు

నర్సీపట్నం : ఇటీవల మరణించిన ఢిల్లీ యూనివర్శిటీ ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభను బీఎస్పీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నియోజకవర్గ కన్వీనర్ బొట్టా నాగరాజు, ఎంఈవో తలుపులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాగరాజు మాట్లాడుతూ సాయిబాబా అంగవైకల్యంతో చక్రాల కుర్చీకే పరిమితమైనా చేయని నేరానికి పదేళ్లు జైలు జీవితం అనుభవించారన్నారు. కన్నతల్లి కడచారి చూపునకు నోచుకోలేదన్నారు. మొక్కవోని ధైర్యంతో నిర్దోషిగా బయటకు రావడానికి ప్రొఫెసర్ సాయిబాబా కనబరిచిన పోరాట పటిమ ఎంతో గొప్పదని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్టీ యూనియన్ నాయకులు చిట్టియ్య, అప్పలనాయుడు పాల్గొన్నారు.

అధిక మోతాదులో నత్రజని వాడడం హానికరం

మాడుగుల రూరల్ : ఖరీఫ్ వరి పంటకు అధిక మోతాదులో నత్రజని వాడడం హానికరమని మండల వ్యవసాయాధికారి ఎం.వాసుదేవరావు అన్నారు. వరి పంటలో సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వరి పంటకు పాముపొడ తెగులు అధికంగా ఆశించడంతో పాటు అగ్గి తెగులు సోకిందని, దీనివల్ల నత్రజని ఎరువులు వాడకూడదని, తెగులు పూర్తిగా తగ్గుముఖం పట్టిన తర్వాత మాత్రమే నత్రజని ఎరువు వాడాలని రైతులకు సూచించారు. వరి పంట చిరుపొట్ట దశకు చేరుకున్న తర్వాత ఒక ఎకరానికి 25 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ ఎరువులను మితంగా ఉపయోగించుకోవాలని సూచించారు.

మెడిటేషన్ సెంటర్ ప్రారంభం



కార్యక్రమంలో మాట్లాడుతున్న పద్మావతి

నర్సీపట్నం : మున్సిపాలిటీ బలిఘట్టం బీసీ కాలనీలో రామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్ నెస్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఈ సెంటర్‌ను స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు సతీమణి మున్సిపల్ కౌన్సిలర్ సిహెచ్.పద్మావతి, జెడ్పీటీసీ రమణమ్మ ఆదివారం ప్రారంభించారు. ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరూ ఒత్తిడితో కూడిన జీవనాన్ని గడుపుతున్నారని, పర్మనెంట్ సెంటర్ ఏర్పాటుతో ఈ ప్రాంత వాసులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. మానసిక ప్రశాంతత, ఒత్తిడిని అధిగమించేందుకు మెడిటేషన్ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎం.సత్యనారాయణ, లక్ష్మయ్య పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా మునగపాక అభివృద్ధి



బాల గణపతి సేవా సంఘు సభ్యులకు తీర్మానం అందజేస్తున్న దృశ్యం

మునగపాక: మునగపాక గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ రాజకీయాలకు అతీతంగా సహకరించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాకలోని బాల గణపతి సేవా సంఘం సభ్యులకు ఆదివారం పంచాయతీ పాలకవర్గం తరఫున సామాజిక భవనం కోసం తీర్మాన కాపీని అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా పంచాయతీ పాలక వర్గం సేవలందిస్తుందన్నారు. అర్హులైన ప్రతి సంఘానికి పంచాయతీ ద్వారా మేలు జరుగుతుందన్నారు. పంచాయతీ పరిధిలోని అన్ని ప్రాంతాలు రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చెందేలా చూడాలన్నారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, వార్డు సభ్యులు బొడ్డేడ సోమరాజు, ఆడారి అప్పలనాయుడు, ప్రసాద్, వేగి కృష్ణ, పీలా శివ, తూర్పు కాపు సంఘం అధ్యక్షుడు బలిరెడ్డి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ నేతలు కోనపల్లి రామ్మోహనరావు, ఆడారి కాశీబాబు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యార్థులకు అన్ని రంగాలపై ఆసక్తి అవసరం



డ్రాయింగ్‌లో నైపుణ్యం ప్రదర్శిస్తున్న పిల్లలు

మునగపాక: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాలపై కూడా ఆసక్తి చూపాలని మాఊళ్లో గ్రంథాలయం ప్రోత్సాహకురాలు భీశెట్టి రామలక్ష్మి కోరారు. మండలంలోని మంగళవరపపేటలో మాఊళ్లో గ్రంథాలయం ఆధ్వర్యంలో పిల్లలకు సహ పాఠ్య ప్రణాళిక అంశాలు అభివృద్ధి సాధించేందుకు, చేతి నైపుణ్యం వృద్ధి చెందేందుకు డ్రాయింగ్‌పై శిక్షణ ఇచ్చారు. చదువులో క్రమ శిక్షణ, ఓర్పు, నైతిక విలువలు, భాషాభివృద్ధి చెందేందుకు ఏకాగ్రత అవసరమన్నారు. భగవద్గీతపై కూడా అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ డైరెక్టర్ భీశెట్టి తులసి, డ్రాయింగ్ ఉపాధ్యాయుడు చదరం రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే రమణకు ఘన నివాళి



మాజీ ఎమ్మెల్యే రమణ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మునగపాక: ప్రజా సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటం చేసిన రమణ జీవితం ఆదర్శం కావాలని సీపీఎం నాయకుడు గనిశెట్టి సత్యనారాయణ కోరారు. దివంగత మాజీ ఎమ్మెల్యే పీవీ రమణ జయంతి సందర్భంగా ఆదివారం మునగపాకలో ఆయన విగ్రహానికి పలువురు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ నీతివంతమైన రాజకీయాలు చేస్తూ ప్రజల పక్షాన నిలబడిన మహోన్నతి వ్యక్తి రమణ అన్నారు. నల్ల బెల్లం, విద్యుత్ ఉద్యమంలో రమణ పోషించిన పాత్ర నేటికీ ఈ ప్రాంత ప్రజలు మరువలేరన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, కర్రి అప్పారావు, బ్రాహ్మజీ, శ్రీనివాసరావు, రాము, దాడి ముసిలినాయుడు, మొల్లేటి సత్యనారాయణ పాల్గొన్నారు.

పాస్టర్ జయరాజ్ మృతికి సంతాపం



పాస్టర్ జయరాజ్(ఫైల్)

నక్కపల్లి: మండలంలో సుపరిచితులైన పాస్టర్ జయరాజ్ మృతికి వివిధ రాజకీయ పార్టీ నాయకులు, క్రైస్తవ సంఘ పెద్దలు, కాపరులు సంతాపం వ్యక్తం చేశారు. నెల్లిపూడికి చెందిన జయరాజ్ ఆదివారం అనారోగ్యంతో మరణించారు. వేంపాడు, నెల్లిపూడి, గునిపూడి, డీఎల్‌పురం, బంగారయ్యపేట, అమలాపురం, పాటిమీద, మూలపర, తమ్మయ్యపేట, నక్కపల్లి తదితర ప్రాంతాల్లో క్రీస్తు బోధకుడిగా జయరాజ్ సుపరిచితుడు. భగవంతుని దృష్టిలో అన్ని మతాల సారాంశం ఒకటేనని, మానవ సేవ ఎంతో ముఖ్యమంటూ బోధించేవారని పలువురు ఆయనతో ఉన్న జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. జయరాజ్‌కు భార్య, ముగ్గురు కుమార్తెలున్నారు. పెద్దకుమార్తె పద్మావతి నక్కపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయినిగా పని చేస్తున్నారు. జయరాజ్ పార్థివ దేహాన్ని పలువురు సందర్శించి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నేత వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, ఉప సర్పంచ్ వీసం రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్, ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, కాంగ్రెస్ అధికార ప్రతినిధి మేడేటి శంకర్, తదితరులు జయరాజ్ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం(మునగపాక): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుందని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ అన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా ఆదివారం అచ్యుతాపురం మండలం రామన్నపాలెంలో సీసీ రోడ్ల నిర్మాణాలకు ఆయన ఎమ్మెల్యే విజయకుమార్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తామన్నారు. ప్రజలు కూడా గ్రామాలాభివృద్ధిలో సహకారం అందించాలన్నారు. మాజీ ఎమ్మెల్సీలు మాధవ్, చలపతిరావు, పార్టీ నేతలు జనపరెడ్డి శ్రీనివాసరావు, రమేష్‌కుమార్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బీజేపీ తొత్తుగా కూటమి ప్రభుత్వం

- విద్యుత్ ఛార్జీలు పెంచితే ఉద్యమం తప్పదు
- చినకోనాంలో ప్రజలతో కలిసి సీఐటీయూ నిరసన



చిన కోనాంలో నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

చీడికాడ : విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపితే ఉద్యమం తప్పదని సీఐటీయూ మండల కార్యదర్శి ఆర్.దేముడునాయుడు హెచ్చరించారు. ఆదివారం మండలంలోని చినకోనాంలో ప్రజలతో కూడి పెంచిన విద్యుత్ చార్జీలు, నెరవేర్చని హామీలపై నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ 2018 నుంచి కేంద్ర ప్రభుత్వం విద్యుత్ చార్జిలు పేరిట రాష్ట్ర ప్రజలపై రూ.8500 కోట్లు భారం మోపిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ చార్జిలు సర్దుబాటు చేస్తే అప్పుడు ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు బాదుడే బాదుడు అంటూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేసారన్నారు. మరి నేడు సీఎంగా ఉండి ఆయన విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలకు ఏం సమాధానం చెబుతారన్నారు. అలాగే కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఎప్పుడు నెరవేర్చుతారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి కుంబోయిన కన్నబాబు, గిరిజన సంఘం నాయకులు వి.రాము, వార్డు మెంబర్ నాగరాజు పాల్గొన్నారు.